సాక్షి
అనకాపల్లి
బుధవారం । 11 । అక్టోబర్ । 2023



గ్రామాల అభివృద్ధి

మంత్రి అమర్‌నాథ్ కుంచంగి, వెంకుపాలెం గ్రామాల్లో రూ1.15 కోట్లతో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాలను ప్రారంభించారు. 10లో



టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన

విశాఖ: సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్న లాన్ టెన్నిస్ క్రీడాకారిణి కె.సాయి శ్రీఅనిషాను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

స్వల్ప వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజుల్లో ఒక రోజు స్వల్ప వర్ష సూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న 4 మి.మీ వర్షపాతం, 33.8 నుంచి 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

నేడు ఎస్.రాయవరంలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల: ఈనెల 11వ తేదీన ఎస్.రాయవరంలో 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా, మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు.

యువతులకు ఉద్యోగావకాశాలు

తుమ్మపాల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 11న మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురంలో గల యకొహోమ కంపెనీలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత కలిగిన 18 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువతులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఎత్తు 5.3 అంగుళాలు ఉండాలని, మరింత సమాచారం కోసం 7036363272 నంబర్‌కు ఫోన్ చేయవచ్చని పేర్కొన్నారు.

విద్యార్థి మృతి ఘటనలో హెచ్‌ఎం సస్పెన్షన్

పాయకరావుపేట : పాయకరావుపేట దుర్గానగర్ పాఠశాలలో స్లాబ్ సిమెంట్ పలక పడి విద్యార్థి ప్రసన్న మరణించిన ఘటనకు సంబంధించి పాఠశాల హెచ్‌ఎం కమల్‌కిరణ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కాగా ఈ ఘటనపై ఆర్‌డీవో, డీఈవో, ఎంఈవోలతోకూడిన కమిటీ ఏర్పాటు చేసి ప్రమాదానికి గల కారణాలు, ఎవరు బాధ్యులనే దానిపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించినట్టు డీఈఓ తెలిపారు. కాగా తమ కుమారుడి మరణానికి ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని విద్యార్థి తండ్రి సతీష్ ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పనులను పర్యవేక్షిస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని, స్లాబ్‌పై పలక ఏర్పాటు చేసే సందర్భంలో సరైన సపోర్టు ఏర్పాటు చేయకపోవడం వల్లే పలక జారిపడిందని ఘటనను చూసిన వారు చెబుతున్నారు.


కలెక్టరేట్‌లో జీఈఆర్‌పై సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి

తుమ్మపాల : స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి కోటపాడు, సబ్బవరం మండలాలకు చెందిన విద్యాశాఖాధికారులు, డీఎల్‌డీవో, జీవోడబ్ల్యూఎస్, ఎంపీడీవోలతో సమీక్ష సమావేశమయ్యారు. సమావేశంలో జీఈఆర్‌పై సమీక్షించారు. జిల్లాలో 9569 క్లస్టర్లకు గాను 9444 వలంటీర్లు, 249776 మంది పిల్లలకుగాను 247023 మంది పిల్లలకు సర్వే నిర్వహించినట్టు ఎంఈవోలు వివరించారు.

విద్యార్థినులకు ప్రధాని ప్రశంసలు



ప్రధాని మోదీ నుంచి ప్రశంసాపత్రాలు అందుకున్న కశింకోట సెయింట్ జాన్స్ స్కూలు విద్యార్థులు

కశింకోట: కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నుంచి ప్రశంసలు లభించాయి. ప్రధాన మంత్రి ప్రస్తుత పరీక్ష విధానంపై విద్యార్థుల ఆలోచనాలు, అభిప్రాయాలు తెలుసుకోవడానికి ఇటీవల 'పరీక్ష పే చర్చ-2023' నిర్వహించారు. దీనిపై అభిప్రాయాలు, ఆలోచనలను స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో 9, 10 తరగతులు చదువుతున్న టి.వై. సోహాలిక, ఎ.ఫణిత, వి.శ్రీవారుణీతేజలు రాతపూర్వకంగా తెలియజేశారు. వారి ఉజ్వల భవిష్యత్‌ను ఆకాంక్షిస్తూ ప్రధానమంత్రి తపాలా ద్వారా ప్రశంసా పత్రాలను పంపినట్లు స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ, ప్రిన్సిపాల్ రూపనంది మంగళవారం తెలిపారు.

బాలికా... ఏలిక..!

- లైంగిక వేధింపులకు అడ్డుకట్ట
- పాఠశాలల్లో 'భరోసా బాక్స్'
- గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన
- సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కమిటీ
- నేడు అంతర్జాతీయ బాలిక దినోత్సవం





సాక్షి, అనకాపల్లి: ఆధునిక యుగంలో మగవారితో సమానంగా ఆడపిల్లలు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. విద్యలో, రాజకీయంగా, చట్టసభల్లో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారి రక్షణకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తోంది. దిశ పోలీస్‌స్టేషన్లు, దిశా యాప్, వన్‌స్టాప్ సెంటర్లను ఏర్పాటు చేసింది. పదవుల్లో పురుషులతో సమానంగా అవకాశం ఇచ్చింది. బాలికల హక్కుల కోసం జరిగిన ఉద్యమాల ఫలితంగా బాల్యవివాహాలు తగ్గుముఖం పట్టాయి. వారు విజయ తీరాలను చేరుకోవడానికి ఇవి తగినంత బలాన్ని ఇస్తున్నాయి.

వివేచన.. విచక్షణ

ఇది గుడ్‌టచ్....ఏది బ్యాడ్ టచ్ అనేది తెలుసుకునేలా యుక్త వయస్సు బాలికల్లో అవగాహన కల్పించేలా పాఠశాల స్థాయిలోనే చేసిన ఏర్పాట్లు సత్ఫలితాలు ఇస్తున్నాయి. బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా విద్య, స్త్రీ శిశు సంక్షేమ, పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1,904 పాఠశాలలు, 133 జూనియర్ కాలేజీల్లో పోక్సో చట్టంపై అవగాహన కల్పించేలా పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆరేళ్ల లోపు బాలికలు 80,760 మంది ఉన్నారు. నర్సీపట్నం, కశింకోటలలో రెండు బాలికల చిల్డ్రన్ హోంలు ఉన్నాయి. ఈ రెండు చోట్ల 110 మంది బాలికలకు ఉచిత వసతి కల్పిస్తున్నారు.

'భరోసా'గా నిలుస్తున్న 'బాక్స్'

ప్రతీ పాఠశాల, జూనియర్ కళాశాలల్లో హెచ్‌ఎం గదికి సమీపంలో అందరికీ కనిపించేలా బాలికల కోసమని ప్రత్యేకంగా 'భరోసా బాక్స్' ఏర్పాటు చేశారు. బాక్స్‌కు తాళం వేసి, దానిని ప్రతీ పదిహేను రోజులకోకసారి ఎంఈవో పర్యవేక్షణలోని కమిటీ సభ్యులైన మహిళా పోలీసు, వైద్యారోగ్యశాఖ ఏఎన్‌ఎం సమక్షంలో తెరుస్తున్నారు. ఏమైనా ఫిర్యాదులు లేదా సూచనలు, సలహాలు ఉంటే, వాటిని వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచి, పరిష్కారం కోసం సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు.

బాలికలకు జగనన్న ఇచ్చిన తోడు ఇవే:-
చైల్డ్‌లైన్ 1098
ఏపీ పోలీసు 100
దిశ 112
ఉమెన్ హెల్ప్‌లైన్ 181
ఎమర్జెన్సీ:-108
మెడికల్ హెల్ప్‌లైన్ 104



అత్యవసర టోల్ ఫ్రీ నంబర్లతో ముద్రించిన పోస్టర్లు

పటిష్టమైన చర్యలు



అన్ని పాఠశాలల్లో భరోసా బాక్స్‌లను ఏర్పాటు చేశాం. కౌమార విద్యపై ఓ మహిళా ఉపాధ్యాయురాలికి బాధ్యత అప్పగించాం. బాలికా సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నాం.

– వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

ఔరా...ఆర్య!





ప్రశంసాపత్రాలు, పతకాలతో చిన్నారి లాస్విక ఆర్య

- అతిపిన్న వయసులోనే రికార్డులు, అవార్డులు
- బాలికల దినోత్సవాన పుట్టిన బాలిక అరుదైన ఘనత

సాక్షి, అనకాపల్లి : అంతర్జాతీయ బాలికల దినోత్సవం రోజున జన్మించిన అనకాపల్లి మండలం రేబాక గ్రామానికి చెందిన లాస్విక ఆర్య అతి పిన్న వయస్సులోనే అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. 6 నెలల వయస్సులో 'వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో, 9 నెలల వయస్సులో ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో 'మెమొరి ఆఫ్ జీకే అవార్డు' బంగారు పతకం, ప్రశంసాపత్రాలు సాధించి అందరి మన్ననలు పొందుతోంది. జాతిపిత మహాత్మా గాంధీ, స్వాతంత్ర్య సమరయోధులతో పాటు ఏపీ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, దేశంలో గల అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఫొటోలను గుర్తిస్తుంది. 1 నుంచి 20 వరకూ స్క్వేర్స్‌ను గుర్తించి ' మెమొరీ ఆఫ్ జనరల్ నాలెడ్జ్' విభాగంలో 'చాంపియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సంపాదించింది. అక్టోబర్ మొదటి వారంలో 'లిటిల్ చాంప్-2023'' ప్రశంసా పత్రాలు, ట్రోఫీ, బ్యాడ్జ్, మెడల్‌ను అందించారు. ఈ ఏడాది జూలైలో 'ఇండియన్ స్టార్ బుక్ ఆఫ్ రికార్డు'లో కూడా చిన్నారి స్థానం పొందింది. 9 నెలల వయస్సులో 4 నిమిషాల వ్యవధిలో 24 మానవ శరీర భాగాలు గుర్తించడంతో 'మాక్సిమమ్ బాడి పార్ట్స్ ఐడెంటిఫైడ్ బై ఏ ఇన్‌ఫ్యాంట్'గా ప్రశంసాపత్రంతో పురస్కారాన్ని పొందింది. గతేడాది అక్టోబర్ 11న జన్మించిన లాస్విక ఆర్య ఏడాది కూడా పూర్తి కాకుండానే సాధిస్తున్న విజయాల పట్ల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హర్షం తెలిపారు. తాను పుట్టిన ప్రపంచ బాలికల దినోత్సవానికి ఎక్కడా తీసిపోకుండా తాను సాధించిన విజయాలతో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఆఫ్‌లైన్‌లో నిత్యావసర సరకుల పంపిణీ

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశం

నక్కపల్లి : సాంకేతిక సమస్యల కారణంగా అక్టోబరు నెలకు సంబంధించిన నిత్యావసర సరుకులు ఆఫ్‌లైన్ విధానంలో పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశించినట్లు నక్కపల్లి తహసీల్దార్ అంబేద్కర్ తెలిపారు. ఈ ఇబ్బందులపై మంగళవారం జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో రాష్ట్ర అధికారులు ఈ సూచనలు జారీ చేసారన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా తెల్లకార్డు దారులకు నిత్యావసర సరుకులు పంపిణీకి సమస్యలు తలెత్తాయి. ఈ పోస్ యంత్రాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో కొంతమంది కార్డుదారులకు సరకులు పంపిణీ చేయడంలో ఇబ్బంది ఏర్పడింది. ఇటువంటి సమస్యలు తలెత్తిన ప్రాంతాల్లో షెడ్యూల్‌ను విడుదల చేయడం జరుగుతుందన్నారు. డీలర్ లాగిన్ నుంచి ఈపోస్ యంత్రంలో డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుందని, సిమ్ కార్డును ఈపోస్ యంత్రం నుంచి తొలగించాలని తెలిపారు. ప్రతి రోజు వీఆర్‌వో బయోమెట్రిక్ తప్పనిసరి అన్నారు. ఈపోస్ యంత్రంలో నెలకొన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించేవరకు ఈ విధంగా ఆఫ్‌లైన్‌లో సరకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఎండీయు ఆపరేటర్, వీఆర్వో, సీఎస్‌డీటీ, ఏఎస్‌వో, తహసీల్దార్‌లు ప్రత్యేక దృష్టి పెట్టి ఆఫ్‌లైన్ విధానంలో కార్డుదారులకు అక్టోబరు సరకులు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ సూచించారన్నారు.

మార్టూరును సందర్శించిన కేంద్ర బృందం సభ్యుడు



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రషీద్‌తో డీపీవో శిరీషారాణి

అనకాపల్లి టౌన్ : మార్టూరు గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కేంద్ర పంచాయతీరాజ్ కిల్లా (కేరళ రాష్ట్రం త్రిసూర్) బృందం సభ్యుడు రషీద్ మంగళవారం పరిశీలించారు. మార్టూరు పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేసేందుకు ముందుగా బృందం సభ్యుడిని పరిశీలన కోసం పంపించినట్టు పంచాయతీరాజ్ అధికారిణి ఆర్.శిరీషరాణి చెప్పారు. పంచాయతీ భవనాన్ని, గ్రామ సచివాలయంలో రికార్డులను పరిశీలించి, కంప్యూటరైజ్ ద్వారా ప్రజలకు అందజేస్తున్న సేవలపై ఆరా తీయడంతో పాటు చెత్త నుంచి సంపద కేంద్రం, ఆర్‌బీకే కేంద్రాలను పరిశీలించినట్టు ఆమె చెప్పారు. ఇక్కడ నివేదికను వారం రోజుల్లో కేంద్రానికి రషీద్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నివేదిక ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను అందజేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి, ఈవోఆర్డీలు ధర్మారావు, కామేష్, పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరావు, సర్పంచ్ కరణం రెవెన్యూ నాయుడు, ఎంపీటీఎస్ రామచంద్రరావు, పాల్గొన్నారు.

దసరాకు స్పెషల్ బస్సులు 500కు పైనే!

- విజయవాడ, హైదరాబాద్‌లకు అధిక సర్వీసులు
- దసరాకు ముందు.. తర్వాత నడిపేలా సన్నాహాలు
- 19 నుంచి అందుబాటులోకి స్పెషల్ సర్వీసులు
- ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలే వసూలు



సాక్షి, విశాఖపట్నం: దసరాకు ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడపడానికి సన్నద్ధమవుతోంది. ఈ పండక్కి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం నడుస్తున్న రెగ్యులర్ సర్వీసులకు అదనంగా వీటిని నడపనుంది. ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి ఈ దసరాకు 500కు పైగా బస్సులను అందుబాటులో ఉంచుతోంది. వీటిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు హైదరాబాద్‌కు పంపడానికి ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 23న దసరా పండుగను జరుపుకుంటున్నారు. అంతకు ముందుగానే పలువురు తమ స్వస్థలాలకు పయనమవుతారు. ఏటా దసరాకు హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి విశాఖకు, ఉత్తరాంధ్ర జిల్లాలకు పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. అందువల్ల ఈ నెల 19, 20, 21, 22 తేదీల్లో హైదరాబాద్ నుంచి రోజుకు 20 బస్సులు, విజయవాడ నుంచి 10 బస్సులు చొప్పున నడపనున్నారు. ఇంకా విశాఖ నుంచి ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు వెళ్లే వారి కోసం కూడా 22, 23 తేదీల్లో 200 వరకు బస్సులను తిప్పనున్నారు. అలాగే దసరా అనంతరం ఉత్తరాంధ్ర, విశాఖల నుంచి రాజమండ్రి, విజయవాడ, హైదరాబాద్‌ల వైపు తిరుగు పయనమయ్యే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని మరో 200 బస్సులకు పైగా ఆయా ప్రాంతాలకు పంపించనున్నారు. వీటిని ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు నడపనున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

మరోవైపు ప్రయాణికుల సౌకర్యార్థం ఇప్పటికే ఆర్టీసీ రిజర్వేషన్ సదుపాయాన్ని అందుబాటులో ఉంచింది. ముందస్తుగా కొంతమంది ఇప్పటికే రిజర్వేషన్ చేయించుకుంటున్నారు.

స్పెషల్స్‌లోనూ సాధారణ చార్జీలే..

సంక్రాంతి, దసరా వంటి పండగ రోజుల్లో పండగలకు సొంతూళ్లకు వెళ్లే వారికి సంఖ్య అధికంగా ఉంటుంది. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా స్పెషల్స్ పేరిట ఆర్టీసీ అదనపు బస్సులు నడుపుతుంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో సాధారణ బస్సుల్లో టిక్కెట్టు చార్జికంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుంది. ఉదాహరణకు రూ.100 సాధారణ టికెట్ చార్జి ఉంటే రూ.150 చెల్లించాల్సి ఉంటుంది. ఈ స్పెషల్ బస్సుల్లో ఒకవైపే ప్రయాణికుల రద్దీ ఉండడం, రెండో వైపు ఖాళీ రావల్సి వస్తుండడంతో ఇలా అదనపు చార్జీలు వసూలు చేసేది. ఈ విధానం కొన్నేళ్లుగా ఆర్టీసీలో రివాజుగా వచ్చేది. దీంతో ప్రత్యేక బస్సుల్లో అదనపు బాదుడు బెంగ ప్రయాణికుల్లో ఉండేది. కానీ ఈ దసరాకు నడిపే ప్రత్యేక బస్సుల్లో ప్రయాణించే వారికి ఆర్టీసీ శుభవార్త చెప్పింది. ఈ స్పెషల్ బస్సుల్లో మునుపటిలా అదనపు చార్జీలు వసూలు చేయడం లేదని తెలిపింది. అంటే ఈ ప్రత్యేక బస్సుల్లోనూ సాధారణ బస్సు చార్జీలే ఉంటాయన్న మాట! ఇది దసరా ప్రయాణికులకు ఊరట కలిగించనుంది.

బాల్య వివాహాల కట్టడిలో ముందుండాలి

- అవగాహనతోనే ఈ దురాచారానికి అడ్డుకట్ట
- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారామ్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్

అనకాపల్లి టౌన్: బాల్య వివాహల నిర్మూలనలో రాష్ట్రం ప్రథమస్థానంలో నిలిచే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ అన్నారు. స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణమండపంలో ఐసీడీఎస్, ఏపీఎస్‌సీపీసీఆర్ ఆధ్వర్యంలో బాల్య వివాహ నిషేధ చట్టంపై మంగళవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యక్షపోరు సలుపుతున్నట్లు తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల మహిళా సంరక్ష కార్యదర్శులు, సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ప్రజాపతినిధులు చట్టంపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిఉండాలని ఆయన కోరారు. చిన్నతనంలో వివాహాలు చేసుకోవడం వలన ఎక్కువగా ఆత్మహత్యలు జరుగుతున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా 160 మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఐసీడీఎస్ పీడీ కె.అనంతలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎస్.రాయవరం మండలంలో 6 బాల్య వివాహాలను ఆపి, కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు. జెడ్పీ ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలను తీసుకువచ్చినట్లు తెలిపారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీ సౌజన్య, దిశ స్టేషన్ ఎస్ఐ, ఏఎస్ఐ కె.సావిత్రి, ఎన్.మణికుమారి మాట్లాడారు. సభలో ముందుగా బాల్య వివాహాల కరపత్రాలను ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ గంగాధరరావు, సీడీపీవో ప్రభావతి, ఎంఈవో-2 కోటేశ్వరరావు, నీడ్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సెలవు నిబంధనలు పాటించాలి

అనకాపల్లిలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు ఆదివారాలు, రెండో శనివారం సెలవులు ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నాయని రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక జీవీఎంసీ వేల్పులవీధి బాలికోన్నత పాఠశాలలో ఎంఈవోల పాత్రపై సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో రుచి, శుచి, శుభ్రతల్లో శ్రద్ధ చూపడం లేదని, ఈ విషయం కమిషన్ దృష్టికి వచ్చిందని ఆమె చెప్పారు. పిల్లల పౌష్టికాహారంలో నాణ్యత, బరువులేని కోడిగుడ్లు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఆయన తెలిపారు. డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ సమీక్షలో ప్రతి సమస్యపై దృష్టి సాధించాలని చెప్పారు. పట్టణ ఏఎస్ఐ ఎన్.మణికుమారి, సీడీపీవో కె.ప్రభావతి, జిల్లా ఎంఈవోలు పాల్గొన్నారు.

వర్సిటీలకు దిక్సూచిగా ఏయూ

- ఎన్ఐఆర్‌ఎఫ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపడం పట్ల హర్షం
- నాలుగు విభాగాల్లో ఏయూకు పురస్కారాలు



మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి జ్ఞాపిక స్వీకరిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: రాష్ట్రంలో ఉన్నత విద్యకు దిక్సూచిగా, విద్యా రంగానికి మార్గదర్శిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం విజయవాడలో ఉన్నత విద్యశాఖ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో కేంద్ర విద్యశాఖ ప్రకటించే ఎన్ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్‌లో రాష్ట్రంలోనే ఏయూ నాలుగు విభాగాల్లో అత్యుత్తమ స్థానాల్లో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఓవరాల్ విభాగంలో ఏయూ, కళాశాలల విభాగంలో ఫార్మసీ, ఇంజినీరింగ్ కళాశాలలు, స్టార్టప్ ఇంక్యుబేషన్ రంగాల్లో ఆ హబ్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ.. నాలుగు జ్ఞాపికలను అందజేశారు. రాష్ట్ర విద్య శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ ఈ జ్ఞాపికలను స్వీకరించారు. కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ రిజిస్ట్రార్‌కు సీఐడీ చీఫ్ అభినందన

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌ని రాష్ట్ర క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్(సీఐడీ) చీఫ్ ఎన్‌సంజయ్ అభినందించారు. మంగళవారం అమరావతిలోని తన కార్యాలయంలో స్టీఫెన్‌ను సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. పరిపాలన దక్షత, ఉన్నత విద్యార్హతలు కలిగిన ఆచార్య స్టీఫెన్‌కు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఏయూ పూర్వ విద్యార్థిగా తాను ఎల్లప్పుడూ విశ్వవిద్యాలయం ప్రగతిని తెలుసుకుంటున్నానని సీఐడీ చీఫ్ సంజయ్ తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ క్వార్టర్లీ పరీక్షలు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ క్వార్టర్లీ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని జూనియర్ కాలేజీల్లో విద్యా క్యాలెండర్ మేరకు పరీక్షలు నిర్వహించాలని ఆర్ఐవో రాయల సత్యనారాయణ వెల్లడించారు. రెగ్యులర్ కోర్సుల వారికి ఈ నెల 18 వరకు, ఒకేషనల్ విద్యార్థులకు ఈ నెల 17 వరకు పరీక్షలు జరపాలన్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు నుంచి జారీ చేసిన ప్రశ్నా పత్రాలతోనే పరీక్షలు నిర్వహించాలన్నారు.

అమలాపురం రోడ్డులో కూలిన వంతెన 10లో

క్లుప్తంగా

టీటీడీకి రూ.లక్ష విరాళం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం జిల్లా పరిషత్ హైస్కూలులో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సూరెడ్డి జగన్మోహన్ తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్టుకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. బెంగళూరులోని సిడాట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా ఉద్యోగం చేస్తున్న అతడి పెద్ద కుమారుడు చరణ్‌తేజ తన మొదటి జీతం లక్ష రూపాయలను టి.టి.డి. మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో అందజేశారు.

గంజాయి నిందితులకు 14 రోజుల రిమాండ్

అనకాపల్లి టౌన్: గంజాయి రవాణా చేస్తున్న నలుగురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్లు పట్టణ సీఐ దాడి మోహన్‌రావు మంగళవారం చెప్పారు. సీఐ వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం చెన్నైకు చెందిన గుత్తుల సుందర్ మణి అలియాస్ సుందర్, పెరుమాళ్‌కు చెందిన మణికందన్, మధురైకి చెందిన సుదర్శన్, అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల జంక్షన్‌కు చెందిన ఈపీ సాయికిరణ్ 24 కేజీల గంజాయి బ్యాగ్‌ను తమిళనాడుకు తీసుకెళ్తుండగా, స్థానిక రైల్వే స్టేషన్ రహదారిలో పోలీస్‌లను చూసి వదిలి పెట్టి పారిపోతుండగా పట్టుకున్నారు.

రిసోర్స్‌పర్సన్ మెరిట్ జాబితా విడుదల

విశాఖ విద్య: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాల్లో రిసోర్స్ పర్సన్‌గా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను ప్రకటించినట్లు సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విశాఖ జిల్లా ప్రాతిపదికన జాబితా ప్రకటించామన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే తగిన ధ్రువపత్రాలతో ఈ నెల 11 మధ్యాహ్నం 2గంటల్లోగా విశాఖలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. మెరిట్ జాబితా deovsp.net అనే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి


కుంచంగి వెల్‌నెస్ కేంద్రంలో మంత్రి అమర్‌నాథ్‌కు బీపీ పరీక్షిస్తున్న వైద్యురాలు


వెంకుపాలెంలో రూ21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ప్రజాప్రతినిధులు

- ప్రాధాన్యతా భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి రూరల్: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. అనకాపల్లి మండలంలోని కుంచంగి, వెంకుపాలెం గ్రామాల్లో సుమారు రూ1.15 కోట్లతో నిర్మించిన పలు ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను మంగళవారం ప్రారంభించారు. కుంచంగిలో రూ.25 లక్షల ఉపాధి నిధులతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్(వెల్‌నెస్ కేంద్రం), వెంకుపాలెంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేవలం ప్రచార ఆర్భాటం కోసం శంకుస్థాపనలు చేసి, పనులను గాలికొదిలేసేవారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు తెలిపారు. గడచిన నాలుగున్నరేళ్లలో సంక్షేమంతో పాటుగా అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ఎవరూ ఊహించని మార్పు తీసుకొచ్చామని, ఈ ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఇంతటి అభివృద్ధి, సంక్షేమం జరగలేదన్నారు. కరోనా సంక్షోభాన్ని సైతం అధిగమించి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన అందుతోందన్నారు. కుంచంగి వెల్‌నెస్ కేంద్రంలో మంత్రికి వైద్యురాలు బీపీ తనిఖీ చేశారు. వెల్‌నెస్ కేంద్రాలతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు ఉచితంగా అందుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యతనిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సర్పంచ్‌లు రాపేటి నాగేశ్వరరావు, పల్లేల నాగలక్ష్మి, ఎంపీటీసీ రాపేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవిందు, పల్లేల నాగేశ్వరరావు, పల్లేల దొరబాబు, పల్లేల సాయి కిరణ్, కార్యదర్శి శైలజా రత్నం, పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమలాపురం రోడ్డులో కూలిన వంతెన

- టీడీపీ హయాంలో నిర్మాణం.. ఆరేళ్లకే కూలిన వైనం


అమలాపురం సమీపంలో కూలిన వంతెన

నక్కపల్లి : ఆరేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన వంతెన మంగళవారం కూలిపోయింది. దీంతో పలు గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వేంపాడు నుంచి అమలాపురం మీదుగా రాజయ్యపేట వెళ్లేందుకు ఆరేళ్ల క్రితం ఆర్‌అండ్‌బీ వారు తారు రోడ్డు నిర్మించారు. ప్రకాశరావు చెరువు సమీపంలో మినీ వంతెన నిర్మించారు. ఈ రోడ్డు, వంతెన నాసిరకమైన మెటీరియల్ ఉపయోగించి నిర్మించడంతో ఆరేళ్లు తిరగకుండానే కూలిపోయింది. రూ.లక్షలు వెచ్చించినా, నాసిరకం నిర్మాణ సామగ్రి వల్లే వంతెన కూలిపోయిందని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు సూరాకాసుల గోవింద్ ఆరోపించారు. వేంపాడు నుంచి అమలాపురం మీదుగా తమ్మయ్యపేట, చందనాడ, మూలపర, పాటిమీద, బోయపాడు, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గ్రామాల నుంచి విద్యార్థులు, ఆటోలు, సైకిళ్లపై వేంపాడు జెడ్పీ హైస్కూల్‌కు వస్తుంటారు. అలాంటి సమయంలో వంతెన కూలిపోయి ఉంటే భారీ ప్రమాదం సంభవించేదని స్థానికులు చెప్తున్నారు. బ్రిడ్జి కూలడానికి కొన్నిసెకన్ల ముందు ఇసుక లారీ వెళ్లిందని, లారీ వంతెన మీదకు వచ్చిన సమయంలో కూలినా లారీలో ఉన్న ముగ్గురు ప్రమాదం బారిన పడేవారని పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు రాకపోకలు సాగించేందుకు పక్కనుంచి తాత్కాలిక మార్గం ఏర్పాటు చేశారు. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ వంతెన కూలి పోవడంపై క్వాలిటీ కంట్రోల్ అధికారులు స్పందించి విచారణ చేపట్టాలని, బాధ్యులైన కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా శౌర్య జాగరణ యాత్ర


శౌర్య జాగరణ యాత్రను ప్రారంభిస్తున్న సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ నాయుడు

అనకాపల్లి టౌన్: విశ్వహిందూ పరిషత్ భజరంగ్‌దళ్ శౌర్య జాగరణ యాత్రను స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవస్థానం చైర్మన్ కర్రి మహాలక్ష్మినాయుడు మంగళవారం ప్రారంభించారు. ఆంజనేయస్వామి విగ్రహానికి విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు, అర్చకులు బంకుపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, వాహనంలో అధిష్టింపజేశారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ ఈ నెల 14 వరకూ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో యాత్ర కొనసాగుతుందన్నారు. ఈ యాత్ర ద్వారా యువతీ యువకులు, తమ దేశ ధర్మం, సంస్కృతులు, సంప్రదాయాలకు కేంద్ర బిందువులైన మఠ మందిరాలను, ధార్మిక గ్రంథాల గౌరవాన్ని నిలబెట్టడంలో క్రియాశీలురు కావాలని పిలుపునిచ్చారు. యాత్రలో అందరూ పాల్గొని సనాతన ధర్మ పునర్వైభవ సాధనలో భాగస్వాములు కావాల్సిందిగా కోరారు. యాత్ర కార్యదర్శి బుద్ద సీతారామ్, కన్వీనర్ ఆడారి రాజు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కాండ్రేగుల అరుణ రాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సిద్ధిలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ సుదురుపాటి తాతాజీ, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.


కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో గర్భిణిని తనిఖీ చేస్తున్న ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి

బైలపూడిలో 22 కిలోల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు


పట్టుబడిన గంజాయితో ఎస్‌ఐ రామారావు, సిబ్బంది

మాడుగుల రూరల్: చీడికాడ మండలం బైలపూడి గ్రామంలో 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్‌ఐ పి.రామారావు మంగళవారం తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన మేరకు వివరాలు. బైలపూడి గ్రామ శివారున గుమ్మడి పోతురాజు పాక వద్ద సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో పోతురాజు అలియాస్ చినబాబు ఏలూరు జిల్లాకు చెందిన కశింశెట్టి శ్రీనివాసరావుకు 22 కిలోల గంజాయిని విక్రయిస్తుండగా, వీరిద్దరినీ అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి గ్రామంలోని మరి కొందరు గంజాయి ముద్దాయిలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఇదే గ్రామంలోని కొందరిపై పీడీ యాక్ట్ నమోదు చేసి, ఏడాదిపాటు జైల్లో ఉంచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, తెచ్చినా అటువంటి వారిపై పీడీ యాక్టు అమలు చేస్తామని యస్‌ఐ రామారావు హెచ్చరించారు.

రుణ భారం మోపరాదని మహిళ ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన లక్ష్మి

ఎస్.రాయవరం: తల్లిదండ్రులపై అప్పులభారం మోపరాదని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుని మంగళవారం మృతి చెందింది. ఎస్.రాయవరం ఎస్‌ఐ ప్రసాదరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. దార్లపూడి గ్రామానికి చెందిన అల్లం లక్ష్మి(23)కి మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. భర్తతో మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని దార్లపూడిలోని తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. లక్ష్మికి మళ్లీ వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబర్ నెలలో వివాహం చేసేందుకు ముహూర్తం కూడా నిర్ణయించారు. అయితే ఆ వివాహం చేసుకునేందుకు అవసరమయిన నగదు కోసం, తల్లిదండ్రులు ఉన్న ఇంటిని తనఖా పెట్టి అప్పు తీసుకుంటున్నారు. తనఖా రిజిస్ట్రేషన్ పనులపై కుటుంబ సభ్యులు నక్కపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లారు. తన పెళ్లి కోసం తల్లిదండ్రులు మళ్లీ అప్పులు చేయాల్సివస్తోందని లక్ష్మి మనస్థాపం చెందింది. ఈ మేరకు సెల్‌ఫోన్ వీడియో తీసుకుంది. ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో ఇంటి దూలానికి చీరతో ఉరి బిగించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. వివరాలు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యలమంచిలి పట్టణాభివృద్ధికి నిధులివ్వండి

- గ్రామకంఠం అసెస్‌మెంట్లకు పరిష్కారం చూపండి
- పురపాలక ఉన్నతాధికారులకు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ వినతి

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి పట్టణాభివృద్ధికి నిధులను వెంటనే మంజూరు చేయడంతోపాటు అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర పురపాలక కమిషనర్ పీ కోటేశ్వరరావు, ఇతర ఉన్నతాధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కమిషనర్ కె.ఎ. కొండలరావు, డీఈఈ కె. వీరయ్య కోరారు. మంగళవారం రాష్ట్ర ఉన్నతాధికారులను విజయవాడ, అమరావతిలో ప్రధాన కార్యాలయాల్లో కలిసి విన్నవించారు. మున్సిపల్‌లోని గ్రామకంఠం స్థలాల్లో మూడు వేలకుపైగా భవనాల క్రమబద్ధీకరణ ప్రక్రియ సాంకేతిక, ఇతర కారణాలతో పెండింగ్‌లో ఉందన్నారు. వీటిని ప్రస్తుతం జీరో అసెస్‌మెంట్లుగా చూపుతున్నారన్నారు. వీటన్నింటికీ ఆస్తి పన్ను విధిస్తే, మంచి ఆదాయం సమకూరి పురపాలక అభివృద్ధి సాధ్యమవుతుందని చైర్‌పర్సన్ బృందం విన్నవించింది. వారి వినతిని పరిశీలించిన రాష్ట్ర పురపాలక కమిషనర్ కోటేశ్వరరావు, ప్రాపర్టీ ట్యాక్స్ బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఆశాజ్యోతి సానుకూలంగా స్పందించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రూ. 62.70 లక్షలతో పట్టణంలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలపాలని ప్రజారోగ్య సాంకేతిక శాఖ డిప్యూటీ ఇంజినీర్ ఇన్ చీఫ్‌ను కోరారు. అదేవిధంగా పొరుగు సేవల ఉద్యోగాలకు సంబంధించి కారుణ్య నియామకాలకు చర్యలు తీసుకోవాలని కోరగా, తమ వద్దకు ప్రతిపాదనలు వచ్చిన వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చినట్టు కమిషనర్, డీఈఈ తెలిపారు. త్వరలోనే అభివృద్ధి పనులకు సాంకేతిక అనుమతులు లభిస్తాయన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. ఈ పనులకు ఆమోదం లభిస్తే పట్టణంలో త్వరితగతిన చేపట్టి పూర్తి చేస్తామన్నారు.

పెద్దేరులో పడి యువకుడి మృతి

- వీవీ అగ్రహారం వద్ద తేలిన మృతదేహం


పెద్దేరు నుంచి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో ఒడ్డుకు చేర్చుతున్న బంధువులు

మాడుగుల రూరల్: మండలంలోని జి.అగ్రహారం గ్రామానికి చెందిన చీపురుపల్లి నాగేష్(35) ప్రమాదవశాత్తూ కాలుజారి పెద్దేరు నదిలోపడి మృతి చెందారు. స్థానిక పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సీహెచ్ పెద్దయ్య మంగళవారం అందించిన వివరాలు. మృతుడు నాగేష్ సోమవారం మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో తండ్రి నాగరాజుతో బహిర్భూమికి వెళ్లి వస్తానని పెద్దేరు నదికి వెళ్లారు. నదికి వెళ్లిన నాగేష్ సాయంత్రం అయినా తిరిగి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు గాలించారు. మంగళవారం ఉదయం మృతదేహం వీవీ అగ్రహారం వద్ద పెద్దేరు నదిలో తేలింది. స్థానికుల సమాచారంతో కుటుంబ సభ్యులు, మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. అనంతరం కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని అనకాపల్లి తరలించారు. రజక కుటుంబానికి చెందిన నాగేష్‌కు ఆరేళ్ల కొడుకు ఉన్నాడు. భార్య గతంలోనే మరణించింది. తల్లి తండ్రులు వృద్ధులు. కుటుంబానికి ఆధారమైన కొడుకు మరణించడంతో ఆ తల్లిదండ్రుల ఆవేదన వర్ణనాతీతం. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చడంలో అగ్నిమాపక సిబ్బంది వి.రాజేశ్వరావు, రామారావు, మణికంఠ అగ్నిమాపక శకటంతో వెళ్లి సాయపడ్డారు.

రగ్బీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన టి.అర్జాపురం విద్యార్థులు


రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన రావికమతం విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: రగ్బీ పోటీలో టి.అర్జాపురం, రావికమతం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ నెల 8, 9 తేదీల్లో దిబ్బిడిలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి రగ్బీ పోటీలలో టి.అర్జాపురం హైస్కూల్ విద్యార్థులు మరిసా భాను అండర్–14 విభాగంలోనూ బోయిన త్రినాథ్ అండర్–17 విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ఈ నెలాఖరున కర్నూలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రావికమతం హైస్కూల్‌కు చెందిన పి.అశ్విని, జి.ఉమామహేశ్వరి కర్నూలు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టు తరపున పాల్గొని మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను రావికమతం హైస్కూల్ హెచ్‌ఎం జి.అప్పలనాయుడు, పీడీ లక్ష్మణ రావు, టి.అర్జాపురం హెచ్‌ఎం కేఆర్ఎస్ నాయుడు, పీడీ రమేష్ నాయుడు, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించారు.

ఉత్సాహంగా గుర్రాల పరుగు పోటీలు


పరుగు పందెంలో దౌడు తీస్తున్న గుర్రం

నాతవరం: మండలంలోని డి.యర్రవరం గ్రామంలో శ్రీ నల్లకొండమ్మ తల్లి పండగ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన గుర్రపు పరుగు పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి విశాఖ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి 20 గుర్రాలు పోటీల్లో పాల్గొన్నాయి. ప్రథమ స్థానంలో చౌడువాడకు చెందిన విక్రమ్ గుర్రం నిలిచింది. మొదటి ఆరు స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నగదు బహుమతులతోపాటు, అమ్మవారి షీల్డ్‌లు అందించారు. పోటీల్లో పాల్గొన్న గుర్రాల యాజమానులకు శ్రీ నల్లకొండమ్మ తల్లి ఫొటో షీల్డును ఉత్సవ కమిటి సభ్యులు అందించారు. పోటీలను చూసేందుకు నాతవరం, నర్సీపట్నం, కోటవురట్ల, కోటనందూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో జనాలు రావడంతో డి.యర్రవరం–జిల్లేడుపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డులో గంటలు తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం ఎర్పడింది. పందేలు నిర్వహించే ప్రాంగణంలో ముందస్తుగా సందర్శకులు తాకిడిని దృష్టిలో పెట్టుకుని బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నాతవరం ఇన్‌చార్జి ఎస్‌ఐ రామారావు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రేపు జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

- అప్పికొండ తీరంలో డీశాలినేషన్ ప్లాంట్
- భీమిలిలో ఘన వ్యర్థాల బయోమైనింగ్
- వీటితో 57 అంశాలపై చర్చ



డాబాగార్డెన్స్: నగరంలో పరిశ్రమల విస్తరణ, కొత్త పరిశ్రమల ఏర్పాటుతో నీటి అవసరాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామిక అవసరాలకు సముద్ర నీటిని శుద్ధి(డీశాలినేషన్) చేసి వినియోగించుకోవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీ ముందడుగు వేసింది. ఈ నెల 12న జరిగే జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల ముందుకు ఈ అంశం రానుంది. ప్లాంట్ ఏర్పాటు విషయమై ఇప్పటికే జీవీఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య పలుమార్లు సమీక్షలు జరిగాయి. ఈ మేరకు 100 ఎంఎల్‌డీ డీశాలినేషన్ ప్లాంట్‌ను పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్‌ను ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక, వాణిజ్య నిర్వహణ, చట్టపర లావాదేవీల సలహా కన్సల్టెంట్‌గా ప్రభుత్వం నియమించింది. వివిధ దశల్లో చర్చలు అనంతరం అప్పికొండ సముద్ర తీరం సమీపంలో సుమారు 25 ఎకరాల్లో 100 ఎంఎల్‌డీ డీ శాలినేషన్ ప్లాంట్ పీపీపీ పద్ధతిలో ఏర్పాటుకు గత జూన్‌లో ఒప్పందం జరిగింది. ఇక్కడ ప్లాంట్ ఏర్పాటుకు రూ.600 కోట్లు ఖర్చు అవుతుందని కన్సల్టెంట్ సంస్థ అంచనా వేసింది. మొదటిగా 50 ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటు చేసి.. డిమాండ్ బట్టి రెండో విడతగా 50 ఎంఎల్‌డీ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇందుకు సంబంధించి 100 ఎంఎల్‌డీ కెపాసిటీతో ఉప్పునీటి పైపులైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆ సంస్థ శుద్ధి చేసిన నీటిని 80 శాతం వరకు 33 ఏళ్ల పాటు జీవీఎంసీ తీసుకుని వివిధ పరిశ్రమలకు సరఫరా చేయనుంది. ఇందుకు సంబంధించి కార్పొరేషన్ ముందస్తు అనుమతితో వివిధ డాక్యుమెంట్లను.. పరిశీలన, ఆమోదానికి ప్రభుత్వానికి పంపారు. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఈ నెల 12న జరిగే కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంపై ప్రధానంగా చర్చించనున్నారు. అలాగే పలు అభివృద్ధి పనులకు సంబంధించి 57 అంశాలతో పాటు మరికొన్ని టేబుల్ అజెండా అంశాలు చర్చకు రానున్నాయి.

- భీమిలి డంపింగ్ యార్డ్‌లో ఆరు ఎకరాల్లోని ఘన వ్యర్థాలను బయో మైనింగ్ చేసేందుకు రూ.1.70 కోట్లతో పనులు నిర్వహించేందుకు మేయర్ జారీ చేసిన ముందస్తు పరిపాలనాపరమైన ఆమోద అంశం కౌన్సిల్ ముందుకు రానుంది.

క్లుప్తంగా

నేడు గోపాలపురంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'

అనకాపల్లిటౌన్: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మండలంలోని గోపాలపురం ఎంపీపీ స్కూల్ ఆవరణలో బుధవారం ఉదయం 9 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి వాణీజగదీశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో ఎ.హేమంత్‌కుమార్, ఎంపీపీ గొర్లి సూరిబాబు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. గోపాలపురం సచివాలయం పరిధిలో గతంలో రక్తపరీక్షలు చేయించుకుని, టోకెన్లు పొందినవారితోపాటు, స్పాట్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కూడా వైద్య సేవలు పొంద వచ్చన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వైద్యశిబిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు పాల్గొని, రోగుల్ని పరీక్షించి, ఉచితంగా మందులు అందిస్తారని, కంటి చూపు సమస్యలున్నవారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

నూతలగుంటపాలెంలో..

కశింకోట:మండలంలోని నూతలగుంట పాలెం సచివాలయంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, స్థానిక పీహెచ్‌సీల వైద్యులు హాజరై రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో రవిరామ్ జవహర్

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 45 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదు రోజులపాటు ఆస్పత్రిలో వసతి, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్యసహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 668 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,580	4,620
రెండో రకం	4,260	4,380
మూడోరకం	3,810	4,110

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
మంత్ ఆఫ్ మధు	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్సార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 40 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 312 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

ప్రజలకు చేరువగా ఆధునిక వైద్యం



104 వాహనంలో ఈసీజీ పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి



వైద్య శిబిరంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీ బీవీ సత్యవతి

- జగనన్న ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం
- వైద్య శిబిరాల ఏర్పాటుపై సర్వత్రా హర్షం

కశింకోట: దేశంలో ఎక్కడా లేనంతగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవల్ని ప్రజలందరికీ చేరువచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి అన్నారు. కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 4వ సచివాలయానికి సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. శిబిరాన్ని సందర్శించిన ఎంపీ రోగులకు అందుతున్న వైద్య పరీక్షలు, వైద్య సేవలు, కంటి వైద్యం, ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న విభాగాలను, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన శిబిరాన్ని పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ప్రజలతో మమేకమయ్యారు. వైద్య సేవలందిస్తున్న తీరుపై ఆరా తీశారు. శిబిరంలో గర్భిణీకి స్వయంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో అందుతున్న వైద్య సేవలకు ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రక్త పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసీజీ తదితర సదుపాయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న వైద్య పరీక్షలు, ప్రత్యేక నిపుణులైన వైద్యుల సేవలు, ఉచితంగా మందులు అందిస్తుండటంపై ప్రజలు ఆమె వద్ద తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల కోసం ఇంతగా ఆలోచించిన ముఖ్యమంత్రిని చూడలేదంటూ వృద్ధులు ఆనందం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్, ఎంపీపీ కలగా లక్ష్మి, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.తిరుపతిరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు



రోగుల్ని పరీక్షిస్తున్న ప్రత్యేక వైద్యురాలు గ్రేస్ కేథరిన్



కంటి పరీక్షలు నిర్వహించుకోవడానికి నిరీక్షిస్తున్న ప్రజలు



పుట్టు మూగ, చెముడు అయిన పాలశెట్టి బాలచంద్రతో తల్లి వెంకటలక్ష్మి



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో నిర్వహిస్తున్న బీపీ పరీక్షలు



నడవ లేని మహిళను కుర్చీలో తీసుకువస్తున్న సిబ్బంది



చిన్న బాబుతో వైద్య శిబిరానికి వచ్చిన మహిళ

రోగులకు భరోసా.. జగనన్న ఆరోగ్య సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల అవగాహనకు ఏర్పాటు చేసిన టీవీ

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. 4వ సచివాలయానికి సంబంధించి నిర్వహించిన శిబిరానికి 521 మంది హాజరై వైద్య సేవలు పొందారు. మండలంలో ఇప్పటి వరకు నిర్వహించిన ఏడు శిబిరాల్లో ఇదే అత్యధికం. కంటి పరీక్షలు కూడా ఎక్కువగానే జరిగాయి. 142 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 82 మందికి కళ్లద్దాలు, 12 మందిని కేటరాక్టు ఆపరేషన్లకు సిఫార్సు చేశారు. 29 మందిని ఉన్నత వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. 35 మందికి ఆబా కార్డులు పంపిణీ చేశారు. ప్రత్యేక వైద్యులు గ్రేసీ కేథరిన్, సునీల్, పీహెచ్‌సీ వైద్యులు ఎస్.తిరుపతిరావు, ఎ.మనీషా, ఆప్తాలమిక్ అధికారి పావని రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు, ఈసీజీ, మలేరియా, డెంగ్యూ, మూత్రం తదితర పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆరోగ్య సురక్షపై టీవీ ద్వారా ప్రచారం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం, ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్న వైద్య ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. సురక్ష శిబిరంలో టీవీ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఇది స్థానికులను బాగా ఆకట్టుకుంటుంది. శిబిరానికి వచ్చే రోగులు నిరీక్షణ సమయంలో టీవీ చూస్తూ సమగ్ర సమచారం తెలుసుకునే ఏర్పాట్లు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎ.హేమంత్, మండల ప్రత్యేక అధికారి రోజారాణి, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి.సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

కంటి ఆపరేషన్ చేయించారు



పదేళ్ల క్రితం గృహ నిర్మాణ సెంట్రింగ్ పని చేస్తుండగా కర్ర గుచ్చుకుని, కంటి పొర బయటికి వచ్చింది. కంటి చూపు ఇబ్బందిగా మారడంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గత శనివారం నా కంటికి పరీక్షలు నిర్వహించారు. ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. దీంతో విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఆపరేషన్ ఉచితంగానే చేశారు. కొద్ది రోజులు విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు. ఇపుడు బాగుంది.

–నూకల శ్రీను, హౌసింగ్ కాలనీ

పక్షవాతంతో కాలూ, చేయి వంకర



పక్షవాతం వచ్చి కాలు, చేయి వంకర పోయాయి. చాలా రోజుల నుంచి మందులు వాడుతున్నాను. జగనన్న ఆరోగ్య సురక్షకు పెద్ద డాక్టర్లు వస్తారని తెలిసి వచ్చాను. వైద్యులకు నా పరిస్థితి చూపించాను. అన్ని తనిఖీలు చేశారు. పరవాలేదని భరోసా ఇచ్చారు. అవసరమైన మందులు కూడా ఉచితంగా అందించారు.

– వైి.సన్యాసమ్మ, కశింకోట

బ్లడ్ కేన్సర్‌తో మూడేళ్లు నరకం



మూడేళ్లు బ్లడ్ కేన్సర్‌తో బాధపడ్డాను. ఆ సమయంలో చాలా ఇబ్బంది పడ్డాను. ప్రస్తుతం తగ్గింది. అయితే కేన్సర్ ట్రీట్‌మెంట్ సైడ్ ఎఫెక్ట్స్ అనుకుంటా శరీరం, జబ్బలు నొప్పిగా ఉండటంతో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి వచ్చాను. డాక్టర్లు పరీక్షించారు. ఉచితంగా మందులు అందించారు. సంతోషంగా ఉంది.

– జెర్రిపోతుల చిట్టిమ్మ, కస్బావీధి

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ కార్మికుల ధర్నా



సమస్యలు పరిష్కరించాలని డిపో గేటు వద్ద ధర్నా చేస్తున్న ఎన్ఎంయూఏ కార్మికులు

అనకాపల్లిటౌన్: ప్రజా రవాణా శాఖ(ఆర్టీసీ) విజయనగరం జోన్ పరిధిలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల పాటు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ధర్నాలు, ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ డిపో అధ్యక్షుడు ఏఎస్ రావు తెలిపారు. ఆందోళనలో భాగంగా డిపో గ్యారేజీ గేటు వద్ద తొలిరోజైన మంగళవారం భోజన విరామ సమయంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 జనవరిలో విడుదల చేసిన సర్క్యులర్‌కి విరుద్ధంగా సీ అండ్ టీ, యాక్సిడెంట్ కేసులలో చేస్తున్న బదిలీలను నిలిపేయాలన్నారు. మూడేళ్ల ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపు, జీతాలతో ఓటీ, నైట్ అవుట్, డే అవుట్, నైట్ షిఫ్టుల భత్యాలను ప్రతీనెలా చెల్లించాలని కోరారు. క్యాడర్ స్ట్రెంత్ పేరుతో బదిలీలను ఆపాలని, కాలం చెల్లిన బస్సులను నిలుపుదల చేయాలని తదితర డిమాండ్లతో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎం.జె.రావు, ఎం.బంగారురాజు, జీఎస్ రావు, కేబీ నాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణ దుకాణాల తొలగింపు

అనకాపల్లిటౌన్: స్థానిక మెయిన్‌రోడ్డులో రహదారిని ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించినట్లు జెడ్సీ ఎస్.వెంకటరమణ మంగళవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుంచి ట్రాఫిక్ సమస్య పెరిగిందన్నారు. పట్టణానికి గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారని దీంతో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలు, దుకాణ యజమానులు సహకరించాల్సిందిగా కోరారు.

సతకంపట్టు కనకదుర్గ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



శరన్నవరాత్రుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలను ఈ నెల 15 నుంచి 24 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు సతకంపట్టు కనకదుర్గ అమ్మవారి ఉత్సవ కమిటీ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు తెలిపారు. స్థానిక గవరపాలెం కనకదుర్గమ్మవారి ఆలయ సమీపంలో మంగళవారం నూకాంబిక అమ్మవారి దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ అధ్యక్షతన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ప్రముఖుల ప్రోత్సాహం, వివిధ ప్రభుత్వశాఖల సహకారంతో అమ్మవారి ఉత్సవానికి పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆదివారం ఉదయం 9.30 గంటలకు వినాయక పూజ, కలశ ప్రతిష్టాపనతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారి ఉత్సవ పోస్టర్‌ను కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ మాజీ చైర్మన్ దాడి జయవీర్, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు మద్దాల శంకరరావు, సూరిశెట్టి నర్సింగరావు, కాండ్రేగుల వాసు, పెంటకోట జగదుర్గినాయుడు, బుద్ధ భూలోకనాయుడు, కె.ఎం.నాయుడు, పొలిమేర శ్రీనివాసరావు, ఆళ్ల మధు, దాడి అప్పలనాయుడు, పీలా శ్రీనివాసరావు, భీశెట్టి మహేష్, బుద్ద శ్రీను తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల్లో ప్రత్యేక కార్యక్రమాలు

- 15న మధ్యాహ్నం మాలధారణ భవానీలకు భిక్ష, సాయంత్రం అమ్మవారి గుడి నుంచి రథయాత్ర, రాత్రి 8 గంటలకు తాడేపల్లి గూడెం అరవింద ఆర్ట్స్ వారిచే జరుగుతున్న కథ నాటిక ప్రదర్శిస్తారు.
- 16న హైదరాబాద్ మిత్ర క్రియేషన్స్ వారిచే కన్నీటి కథ, భీమవరం ఓంప్రద క్రియేషన్స్ వారిచే బావా ఎప్పుడు వచ్చితీవు నాటికలు ప్రదర్శించనున్నారు.
- 17న హైదరాబాద్ సాయి సంతోషి నాట్యమండలి వారిచే ఘంటసాల, విజయవాడ మైత్రి కళా నిలయం వారిచే ఇతిహాసం నాటికలు.
- 18న గుంటూరు జిల్లా చిలకలూరిపేట సాయి ఆర్ట్స్ వారిచే గమ్య స్థానాల వైపు, నిడుబ్రోలు వారిచే త్రిజుడు నాటికలు.
- 19న గుంటూరు అభినయ్ ఆర్ట్స్ వారిచే ఇంద్ర ప్రస్థం నాటిక వేయనున్నారు.
- 20న బుద్ద గిరిజా స్పందన వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన
- 22న దుర్గాష్టమి సందర్భంగా ముత్తైదువులకు వాయనం ఇవ్వనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ తెలిపారు.

కశింకోట వీధుల్లో హనుమాన్ శౌర రథయాత్ర



కశింకోట వీధుల్లో ఊరేగిస్తున్న హనుమాన్ శౌర యాత్ర రథం

కశింకోట: విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో చేపట్టిన హనుమాన్ శౌర యాత్ర రథం మంగళవారం కశింకోటకు చేరింది. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో హనుమాన్ విగ్రహంతో ఉన్న రథాన్ని భక్తులు మోటారు సైకిల్ ర్యాలీగా ఊరేగించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కస్బావీధి రామాలయం వద్ద రథం నిలిపి కొంతసేపు విడిది చేశారు. అనంతరం వెదురుపర్తి మీదుగా అచ్యుతాపురం మండలం పెదపాడు వైపు రథం వెళ్లింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు శిష్టి అప్పారావు, పీఏ రాజు, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు గుడివాడ గురునాథరావు జయంతి వేడుకలు

అనకాపల్లిటౌన్: మాజీ మంత్రి స్వర్గీయ గుడివాడ గురునాథరావు 68వ జయంతి వేడుకలను పట్టణ, మండలంలో బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండల నాయకులు వారివారి గ్రామాల్లో గురునాథరావు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాల్సిందిగా కోరారు.

ఆస్పత్రి తనిఖీ



చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న జి.రామ్మూర్తి

అనకాపల్లి టౌన్: ఎన్టీఆర్ వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ డాక్టర్ జి.రామ్మూర్తి మంగళవారం ఆస్పత్రిని సందర్శించారు. వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్లతో త్వరలో సీటీ స్కాన్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చెప్పినట్లు పేర్కొన్నారు. మంత్రి చొరవతో సీమెన్స్ కంపెనీ సీటీ స్కాన్ మిషన్ అందించేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఎంవో లక్ష్మణ్ శ్రీనివాస్, మరో డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

సబ్బవరం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిశోర్ సూచనల మేరకు నిర్వహించిన ఈ ర్యాలీని పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమార్ ప్రారంభించారు. సీఐ రంగనాథం, వైస్ ప్రిన్సిపాల్ జె.అ ప్పారావు, జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమ సిబ్బంది జి.సాయిలక్ష్మి, ఎ.మధులత, పాఠశాల వైద్యాధికారి కె.కన్నంనాయుడు పాల్గొన్నారు.

రక్తహీనత గల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అందుతున్న ఆరోగ్య సేవలపై ఆరా తీస్తున్న ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి



విద్యాశాఖ తరపున ఏర్పాటుచేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ సత్యవతి

కశింకోట: రక్త హీనత ఉన్న విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి సూచించారు. స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో రక్త హీనత ఉన్న విద్యార్థులకు విఫ్స్ కార్యక్రమం ద్వారా అందిస్తున్న సేవలను మంగళవారం పరిశీలించారు. 59 మంది రక్త హీనత ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి రోజూ మందులు అందిస్తున్నట్లు హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు బదులిచ్చారు.

స్కూల్లో విద్యార్థులకు రక్త హీనత నివారణలో భాగంగా అందించే పౌష్టికాహారంపై నిర్వహించిన ప్రదర్శనను ఎంపీ తిలకించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వకామదాంబ ఉత్సవ కరపత్రాల ఆవిష్కరణ



ఉత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తల్లి నాగమణి

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం స్వరకామదాంబ అమ్మవారి శరన్నవరాత్రుల మహోత్సవ కరపత్రాలను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాతృమూర్తి గుడివాడ నాగమణి మంగళవారం మింది గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం దసరా ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో భోగలింగేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, వాసుపల్లి తాతయ్యలు, కాండ్రేగుల రాము, కొణతాల త్రినాథ్‌రావు పాల్గొన్నారు.

నా మట్టి-నా దేశం కలశ ఊరేగింపు



సేకరించిన మట్టితో కలశాన్ని సిద్ధం చేసిన ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

కశింకోట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నా మట్టి-నా దేశం కార్యక్రమంలో భాగంగా ఢిల్లీకి పంపించేందుకు బీజేపీ స్థానిక నేతల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలో మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల నుంచి సేకరించిన మట్టిని కశింకోటకు చేర్చి దాన్ని ఒకే కలశంగా తయారు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం కస్బావీధి రామాలయంలో భద్రపరిచారు.

దీన్ని ఢిల్లీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కరక సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఉప్పలపు చిట్టిబాబు, విశ్వ హిందూ పరిషత్ నాయకులు శిష్టి అప్పారావు, వైపీ రాజు, జి.హరనాథ్, ఎంపీటీసీ సభ్యురాలు నడిపల్లి గంగా భవాని, మాజీ ఉప సర్పంచ్ నడిపల్లి సన్యాసిరావు, వార్డు సభ్యులు కోడూరు చిన్నమ్మలు, కరణం పద్మావతి తదితరులు పాల్గొన్నారు.